క్లుప్తంగా

మార్కండేయ ఆలయ శిఖరానికి పూజలు



ధన్వాడ: మండల కేంద్రంలోని భక్త మార్కం డేయస్వామి దేవాలయం గోపుర శిఖరం ప్రారంభోత్సవం, కలశ పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయం శిఖరంపై కలశం ఏర్పాటు చేశారు. దంపతులతో హోమం నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ఉత్సవాలు

నారాయణపేట టౌన్: ఈ నెల 8 నుంచి జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్డులో భక్త మార్కండేయస్వామి ఉత్సవాలతో పాటు పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు స్వామివారి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముస్తాబైనా మార్కండేయ స్వామి దేవాలయం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తపల్లి: మండలంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్ర పరిధిలోని కొత్తపల్లి,గోకుల్‌నగర్ ఉపకేంద్ర పరిధిలోని గ్రామాల విద్యుత్ వినియోగదారులకు గురువారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ప్రధాన రోడ్లపై ఉన్న పాత విద్యుత్ స్తంభాలను మార్చి కొత్త వాటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు, వ్యాపారులు, గృహ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మీసేవ కేంద్రం ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు: మండలంలోని దమగ్నాపూర్ గ్రామంలో మీ సేవ ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్ శ్రీను బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థి మండలానికి చెందిన వ్యక్తి అయి ఉండాలి, దరఖాస్తు దారుడి వయస్సు 21 ఏళ్ల నుంచి 44 లోపు ఉండాలి, కనీస విద్యార్హత డిగ్రీ లేదా దానికి సమానమైన విద్యార్హత, కంప్యూటర్ శిక్షణ పొంది ఉండాలి, ఎంపికైన అభ్యర్థి మీ సేవ కేంద్రం ఏర్పాటు చేయుటకు ఆర్థిక స్తోమత కలిగి ఉండాలి, దరఖాస్తు దారులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ఉంటుదని తెలిపారు. ఆసక్తి గల వారు 'డైరెక్టర్ ఈ గవర్నెన్స్ సొసైటీ నారాయణపేట డిస్ట్రిక్ట్' పేరుతో రూ.1000 డీడీ తీసి ఫారం వెంట జత చేయాలని తెలిపారు. ఫారంను నారాయణపేట, తెలంగాణ, జీఓవీ.ఇన్, వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 12లోపు కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు.

వృత్తివిద్య కోర్సులతో ఉపాధి



కోస్గి రూరల్: వృత్తివిద్య కోర్సులతోనే తొందరగా స్వయం ఉపాధి పొందవచ్చని గుండుమాల్ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నీలిమవర్ధిని అన్నారు. బుధవారం గుండుమాల్ మండలంలోని పీఎంశ్రీ మాడల్ స్కూల్‌లో ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ద్వారా 9,10,11,12 తరగతి విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఏర్పాటు చేశారు. విద్యార్థులు నేర్చుకుంటే స్వయంగా ఉపాధి పొందవచ్చన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. నాటిన మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత దినోత్సవం జయప్రదం చేద్దాం

నారాయణపేట రూరల్: ప్రపంచ చేనేత దినోత్సవ వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు జన్ను ఆంజనేయులు, మాక్స్ సొసైటీ అధ్యక్షుడు పూడూర్ శ్రీనివాస్, లక్ష్మీ సిల్క్ సొసైటీ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పైపులైన్ పనులు ప్రారంభం

మక్తల్: మండలంలోని చిట్యాలలో పైపులైన్ నిర్మాణ పనులు బుధవారం మక్తల్ మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్ ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి గ్రామస్తులు వినతి పత్రం అందజేయడంతో వెంటనే స్పందించి గ్రామానికి రూ.10లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు కట్టసురేష్, రహిమాత్‌పాష, రామలింగం, దత్తు, వెంకటప్ప, లింగప్ప, మారుతి, మధు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు



తిర్మలాపూర్‌లో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం



యర్నాగన్‌పల్లిలో శిథిలావస్థకు చేరిన భవనం



టేకులపల్లి గ్రామంలో బీటలుబారిన భవనం



తిర్మలాపూర్‌లో..



మక్తల్‌లో శిథిలావస్థకు చేరిన కాలేజీ భవనం

- ఆ వైపు కన్నెత్తి చూడని అధికారులు
- పత్తాలేని విద్యాధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మక్తల్: ప్రభుత్వాలు మారినా విద్యార్థుల తలరాతలు మాత్రం నేటికీ మారడంలేదు. ఒక్క పక్క అధికారులు, మరో పక్క ప్రజాప్రతినిధులు సమస్యలపై దృష్టి సారించకుండా వృథాగా వదిలేస్తున్నారు. గ్రామాల్లో సభలు, సమావేశాలున్నా అక్కడి వరకు ఫొటోలకు మాత్రమే పోజులు ఇచ్చి ఫొటోలు దిగుతున్నారు. తర్వాత పాఠశాల వైపు చూడరు. ఇది ఎక్కడోకాదు మక్తల్ నియోజకవర్గం కేంద్రంలో పలు గ్రామాల్లో పాఠశాలల దుస్థితి. పాఠశాలల్లో సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మక్తల్ మండలంలోని తిర్మలాపూర్, పస్పుల, మక్తల్ గ్రామాల్లో పాత శాలల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామాల్లో పాఠశాల భవనాలు కిటికీలు, దర్వాజలు, బండలు లేకుండా ఉండటం వంటి సమస్యలున్నాయి. విద్యార్థులు నేలపై కూర్చొనే పరిస్థితి ఏర్పడింది. మక్తల్‌లో ప్రభుత్వ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. భవనాలను మరమ్మతు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



ధన్వాడ మండల కేంద్రంలో నివాళులర్పిస్తున్న విద్యాశాఖ సిబ్బంది



మక్తల్‌లో జయశంకర్, గద్దర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి,నెట్‌వర్క్: మక్తల్ పట్టణంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని బుధవారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మక్తల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ సంఘం నాయకులు జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

- నారాయణపేటలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రతాపరెడ్డి, జగదీష్, లక్ష్మణ్ ఉన్నారు.
- కొత్తపల్లి మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయరాములు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.
- మాగనూర్ మండలం కోల్పూర్ పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిమ్మన్న, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కోస్గిలో..

- కోస్గి తహసీల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.
- ఊట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చింతరవి, ఆర్ఐ కృష్ణారెడ్డి, వెంకటేష్, బాదం బసిరెడ్డి, భీమకవి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.
- ధన్వాడ మండల కేంద్రంలోని వనరుల కేంద్రం ఎదుట జయశంకర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.
- నారాయణపేట మండలంలోని జాజాపూర్, కోటకొండ, కొల్లంపల్లి, తిరుమలాపూర్, షేర్నపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- దామరగిద్ద జెడ్పీ ఉన్నత పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మక్తల్: పట్టణ శివారులోని ఇద్దరు వ్యక్తులు కుమార్తెలకు పెళ్లి చేసేందుకు నిర్ణయించుకున్నారు. బుధవారం కొందరు వ్యక్తులు 1098కు సమాచారం అందించడంతో చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు, కౌన్సిలర్ విద్యారాణి బీసీ కాలనీకి చేరుకొని బాలికలను తీసుకెళ్లి సీడబ్ల్యూసీ అధికారులు వారి ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఇద్దరిలో ఒకరు మైనర్, మరొకరు మేజర్‌గా ధ్రువీకరించారు. మైనర్‌ను జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తీసుకెళ్లారు. మేజర్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రభుత్వ భూమి సర్వే



మద్దూరు: మద్దూరు రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 71లో ప్రభుత్వ భూమిని కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండల సర్వేయర్ మునీందర్ బృందం ఈ సర్వే నంబర్‌లో 131.21 ఎకరాల భూమిలో అసైన్‌మెంట్ ద్వారా భూమి లేని వారికి 65.20 ఎకరాలు పంపిణీ చేశారు. మిగిలిన భూమిలో ఎవరెవరు కబ్జాలో ఉన్నారనే దానిపై వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి గుర్తించి ఏదైనా అవసరాలకు వినియోగంచుకోనున్నట్లు తెలుస్తోంది.

గద్దర్‌కు నివాళి



మద్దూరు: ప్రజాయుద్ధనౌక గద్దర్ రెండో వర్ధంతిని మద్దూరు పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకోసం అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కృష్ణ, గోపాల్, కృష్ణనాయక్, నర్సింహులు, నారాయణ, రాములు, సామెల్, చిన్నయ్య, అనంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

నారాయణపేట రూరల్: రోగాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని డాక్టర్ ప్రతిభాభారతి, డాక్టర్ శృతి అన్నారు. మండలంలోని కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం హెల్త్ క్యాంప్ నిర్వహించి రోగులకు టీబీ, మలేరియాకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. భవిష్యత్‌లో స్థానికంగా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవచ్చని, ఇలాంటి హెల్త్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ శ్రీధర్, సరస్వతి, ప్రసాద్, ల్యాబ్ టెక్నిషియన్ దశరథ్, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కేంద్రం పథకాలు



మక్తల్: మండలంలోని జక్లేర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ పథకాలు కార్యక్రమం బుధవారం చేపట్టారు. పేదల కోసం నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మక్తల్ కన్వీనర్ కర్ని స్వామి, నాయకులు మాట్లాడారు.

పిచ్చిచెట్ల తొలగింపు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట రహదారికి ఇరువైపుల పిచ్చిచెట్లను బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగింపు పనులు చేపట్టారు. స్టేజీ నుంచి గ్రామానికి వచ్చే దారి పొడవునా పిచ్చి చెట్లు అల్లుకుపోవడంతో గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సిబ్బందితో వాటిని తొలగించే చర్యలు చేపట్టారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



జాజాపూర్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

నారాయణపేట రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, రాయుడు అన్నారు. టౌన్ పోలీస్‌స్టేషన్, గురుకుల పాఠశాల, రూరల్ పీఎస్ ఆధ్వర్యంలో జాజాపూర్ జెడ్పీ స్కూల్లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్‌లో మోసాలు జరుగుతున్నాయని, వాటి ద్వారా జాగ్రత్తగా ఉండాలని, తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పరాదని పేర్కొన్నారు. సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెంబర్ 1930 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలని కోరారు. సైబర్ నేరాలపై నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ 2 గాయత్రి, పాఠశాలల ప్రిన్సిపాల్స్ యామిని, భారతి, డీఎస్‌ఓ భాను ప్రకాష్, పోలీస్ సిబ్బంది శిరీష, సంతోష్, నరసింహ, సుధాకర్, శ్రీరామ్ ఆనందమ్మ, శంకర్, ప్రదీప్, స్వాతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దూరు: టెక్నాలజీ కొంత పుంతలు తొక్కుతున్న కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. 'సైబర్ జాగృతి దివాస్' సందర్భంగా మద్దూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు నాటకాల రూపంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఊట్కూరు: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ రమేష్ కోరారు. సైబర్‌జాగరూప్‌దివాస్ సందర్భంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ, హెల్త్ స్కీంలను అమలు చేసి ఉపాధ్యాయులకు మేలు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, టౌన్ అధ్యక్షుడు వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శి జహీరొద్దీన్, నాయకులు రఘువీర్, మొల్లన్ జనార్దన్, నరేష్, వెంకట్రాంరెడ్డి, వెంకటప్ప, నగేష్, హెచ్‌ఎంలు సత్యనారాయణ సింగ్, శశి కుమార్, జయంత్, బాలరాం, సోనియా, సింధు, భువనేశ్వరి పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్, పెట్రోల్ బంకుల్లో తనిఖీ



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

కోస్గి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని పలు ఫర్టిలైజర్స్, పెట్రోల్ బంకుల్లో ప్రత్యేక తనిఖీ బుధవారం మండల తహసీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి రామకృష్ణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టారు. ఇటీవల కాలంలో వ్యవసాయ అవసరాల కోసం ప్రభుత్వం రంగంలో సరఫరా చేసే యూరియాను ఇతర పరిశ్రమల అవసరాలకు వాడుతున్నారని ఫిర్యాదుల నేపథ్యంలో ప్రత్యేక తనిఖీ చేపట్టమన్నారు. యూరియాతో యాడ్‌బ్లూ లిక్విడ్ తయారవుతున్న నేపథ్యంలో వ్యవసాయ సంబంధిత యూరియా నిల్వలు పెట్రోల్ బంకుల్లో ప్రత్యేక తనిఖీ చేపట్టామన్నారు. ఫర్టిలైజర్స్ యజమానులు స్టాక్ బోర్డులు, ధరల పట్టిక తప్పనిసరిగా ఉంచాలని, వ్యవసాయానికి వినియోగించాల్సిన యూరియాను ఇతర అవసరాలకు దుర్వినియోగం చేస్తే, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తల్లిపాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి



కాట్రెవ్‌పల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్

మక్తల్: మక్తల్ మండలం కాట్రెవ్‌పల్లి, కాచ్‌వార్, సంగంబండ, గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే సరుకులను అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, అవి బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంచుతాయన్నారు. ఆరునెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్, ఏఎన్‌ఎంలు అనసూయమ్మ, వెంకటేశ్వరమ్మ, అండాలమ్మ, అంగన్‌వాడీ టీచరు లక్ష్మి, అంజమ్మ, జయమ్మ, నవీన, లక్ష్మి, శారద పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఏఎన్‌ఎం సత్యనారాయణమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్రమ్మ, కమల, హన్మంతమ్మ, ఆశా కార్యకర్తలు పద్మ, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: తల్లి పాలే బిడ్డకు రక్షణ అని ఐఎంఏ జిల్లా కోశాధికారి, స్త్రీ వైద్య నిపుణురాలు గీత విశ్వనాథ్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని అప్పంపల్లిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఆదిత్య గౌడ్, అక్షత రాకేష్, మహేంద్రవర్మ, ఘగన్ చందన పాల్గొన్నారు.

- భైరంకొండ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. టీచర్ సావిత్రమ్మ, ఏఎన్‌ఎం అనురాధ, ఆశా కార్యకర్త చంద్రకళ పాల్గొన్నారు.
- జాజాపూర్‌లో సూపర్‌వైజర్ గీత బాలింతలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, పద్మజ, ఏఎన్‌ఎం అరుణ, నర్సింహులు, అనిత, ఆశమ్మ, ఉషారాణి, కమలమ్మ పాల్గొన్నారు.

గుడెబల్లూర్‌లో ప్రీ ప్రైమరీస్కూల్ ప్రారంభం



గుడెబల్లూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ నిజాముద్దీన్

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ఎంఈఓ నిజాముద్దీన్ ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదట తెలంగాణ జాతిపిత జయశంకర్ చిత్ర పటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ప్రీ ప్రైమరీ స్కూల్‌లో నాలుగేళ్లు నిండిన చిన్నారులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గణేష్‌సింగ్, పాఠశాల చైర్మన్ నర్సమ్మ, టీచర్లు శ్యామల, సుష్మ, కల్యాణి, రిషిక, శోభ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని చిత్తనూర్‌లోని పాఠశాల ఆవరణలో మండల విద్యాధికారి మీర్జా కరీముల్లా పూర్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. పాఠశాలలను పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం బాలనారాయణ, హెచ్‌ఎం గోవర్ధన్, కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు వీరభద్రప్ప, బాల్‌రెడ్డి, సీఆర్‌పీ శివకుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని అభినందించిన ఎంఈఓ

ఊట్కూరు: మండలంలోని ఒల్లంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఎంఈఓ మాధవి ప్రీ ప్రైమరీ తరగతిని ప్రారంభించారు. ఉపాధ్యాయుడు శశిధర్‌రెడ్డి తన కూతురు సమన్వితను ప్రీ ప్రైమరీ క్లాసులో చేరిపించారు. దీంతో శశిధర్‌రెడ్డిని ఎంఈఓ అభినందించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరిపించడం సంతోషకరం అన్నారు. జీహెచ్‌ఎం గౌరమ్మ, హెచ్‌ఎం సుజాత, సీఆర్‌పీ మహేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి

నారాయణపేట రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ మెర్సీ వసంత అన్నారు. బుధవారం స్థానిక చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని, దేశం కోసం పాటుపడాలని వారు కోరారు. కళాశాలలో 4 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉన్నాయన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుగా చేరి గ్రామీణ ప్రాంతంలో ఉన్న సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధ్యాపకులు రంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సెఫిక్ హైమద్, కృష్ణారెడ్డి, నిర్మల, సంగీత పాల్గొన్నారు.

పర్యావరణ హిత రాఖీల తయారీ



రాఖీలను తయారు చేస్తున్న విద్యార్థులు

కోస్గి రూరల్: పర్యావరణ హిత పదార్థాలతో విద్యార్థులు తయారు చేసిన రాఖీలు అందరిని ఆకట్టుకున్నాయని జాతీయ హరితదళ సభ్యులు, ఎర్త్‌క్లబ్ వార్ల మల్లేశం అన్నారు. బుధవారం మండల పరిధిలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ హిత రాఖీల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో తయారు చేసిన నూలుదారం, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఔషధ మొక్కల విత్తనాలు, ఆకులు ఉపయోగించి, కాగితం, అట్ట, పత్తి, నారతో తయారు చేసిన రాఖీలు ఆరోగ్యకరమన్నారు. ప్లాస్టిక్‌ను దూరం పెడుతూ ఎంతో సృజనాత్మకంగా విద్యార్థులు పర్యావరణ హిత రాఖీలు తయారు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ హితంగా మేలు జరిగే విధంగా రాఖీలు కట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ టీచర్ రాజమణి, ఉపాధ్యాయులు త్రిగుణ, భీమయ్య, సంతోష్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు గీతాబాయ్ డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలకు వెళ్లిందని, అధికారులు డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు రమేష్, వెంకటప్ప, రాజు, తదితరులు ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు 6నెలల క్రితం ప్రసూతి సెలవులపై వెళ్లిందని, సెలువుల అ నంతరం డిప్యూటేషన్‌పై తిప్పరాస్‌పల్లి యూపీఎస్ పాఠశాలలో చేరినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారు లు స్పందించి ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్‌ను ర ద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

దేవరి మల్లప్ప జన్మదిన వేడుకలు

మక్తల్: తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర ట్రేడింగ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మక్తల్ నియోజకవర్గ నాయకుడు దేవరిమల్లప్ప పుట్టిన రోజు వేడుకలు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్వహించారు. అనంతరం పలువురు కార్యకర్తలు, కుర్వ సంఘం నాయకులు, అభిమానులు ఆయనను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.

విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి


కొత్తపల్లి: జనాభా తమాషా ప్రకారం స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించమే తమ అంతిమ లక్ష్యమని కొత్తపల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సాయిలు స్పష్టం చేశారు. తక్షణమే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లుకు ఆమోదం తెలిపి 9వ షెడ్యూల్‌ను చేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ తక్షణమే రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

పోస్టర్ విడుదల



మక్తల్: డ్రగ్స్, గంజాయి, మత్తు మహమ్మారిని తరలిమికొట్టాలని, గ్రామీణా ప్రాంతాల్లో బెల్టుషాపులను తొలగించాలని పీవైఎల్ ఆధ్వర్యంలో బుధవారం మక్తల్ సీఐ కార్యాలయం దగ్గర సీఐ రాంలాల్, ఎస్‌ఐ బాగ్యలక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత పక్కదారి పడుతోందని, బెల్టు షాపుల నుంచి యువత గంజాయితో పాటు, మద్యానికి బానిపై జీవితాలను పాడుచేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దు, ఏజి భుట్టో, పీడీఎస్‌యూ భాస్కర్, తిరుమలేష్, గణేష్, కృష్ణ, శ్రీకాంత్, అనిల్, రవి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సారా అమ్మకం నిషేధించాలి



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న సారాయి అమ్మకాన్ని నిషేధించాలని ఆ గ్రామ యువత బుధవారం ఎక్సైజ్ ఎస్‌ఐకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా నాయకులు చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా నాటుసారా అమ్ముతున్నారని, దీనివల్ల ప్రజలు అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని వాపోయారు. పురుషులతో పాటు మహిళలు సైతం నాటుసారా తాగేందుకు అలవాటు పడ్డారని, దీనివల్ల కుటుంబం వీధిన పడే అవకాశాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నాటుసారా అమ్మకాలను నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.